యాప్ తొలగింపు హర్షణీయం : ఎస్‌టియు

ప్రజాశక్తి-రాజంపేట

మాట్లాడుతున్న నరసింహులు

గత వైసిపి ప్రభుత్వంలో బాత్రూముల ఫొటోలు తీసే బాధ్యతను ఉపాధ్యాయులపై మోపారని, ప్రస్తుత కూటమి ప్రభుత్వం ఆ యాప్‌ను తొలగించడం హర్షణీయమని ఎస్‌టియు రాజంపేట రీజనల్ కన్వీనర్ నీరగట్టు నరసింహులు పేర్కొన్నారు. స్థానిక కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రతిరోజూ బాత్రూములు పరిశుభ్రంగా ఉన్నాయా లేదా అని ఫొటోలు తీసి యాప్‌లో అప్లోడ్ చేయాల్సి వచ్చేదన్నారు. ఆ బాధల నుంచి విముక్తి కల్పిస్తూ ప్రస్తుత ప్రభుత్వం తీసుకున్న నిర్ణయానికి ధన్యవాదాలు తెలుపుతున్నామని చెప్పారు. 2018, 2019 సంవరాల్లోని పెండింగ్ డిఎలు తిరిగి చేసుకొనే అవకాశం కల్పించాలన్నారు. ఐఆర్ దసర లోపల ప్రకటించాలని ప్రభుత్వాన్ని కోరారు. సమావేశంలో ఎస్‌టియు రాజంపేట మండల శాఖ సిపిఎస్ కమిటీ కన్వీనర్ పోలయ్య, నాయకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జడ్‌పిలో పనుల పందేరం!

- రూ.5.10 కోట్లతో అభివృద్ధి పనులు
- జడ్‌పిటిసికి రూ.10 లక్షలు కేటాయింపు
- ఐసిడిఎస్ విభాగంలో పనులకు మొగ్గు

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

జిల్లా పరిషత్‌లో పనుల పందేరం నడుస్తోంది. 2024 సార్వత్రిక ఎన్నికల ముంగిట జిల్లా పరిషత్ చైర్మన్ ఆకేపాటి అమరనాథ్‌రెడ్డి రాజీనామా చేసిన సంగతి తెలిసిందే. ఆయన స్థానంలో ఎఫ్‌ఎసి చైర్‌పర్సన్‌గా ప్రొద్దుటూరు జడ్‌పిటిసి శారద వ్యవహరిస్తున్నారు. జడ్‌పి చైర్మన్ రాజీనామా చేసిన ఆర్నెళ్లలోపు పంచాయతీరాజ్ యాక్ట్ ప్రకారం చైర్మన్ ఎన్నికకు నోటిఫికేషన్ వెలువడాల్సి ఉంది. ఈ ఏడాది డిసెంబర్‌లోపు కొత్త చైర్మన్ ఎన్నిక వ్యవహారాన్ని పూర్తి చేయాల్సి ఉంది. వైసిపి ఐదేళ్ల పాలనలో ఎటువంటి లబ్ధిపొందని జడ్‌పిటిసిలు తీవ్ర అసంతృప్తి సెగలతో రగిలిపోతున్న సంగతి తెలిసిందే. అసంతృప్తులను చల్లబరచడంలో భాగంగానే అభివృద్ధి పనుల పందేరాన్ని తెరపైకి తెచ్చారనే చర్చ నడుస్తోంది. ఇటీవలి జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశంలో జిల్లా పరిషత్ సిఇఒ జనరల్ ఫండ్స్ కింద సుమారు రూ.ఎనిమిది కోట్ల మేర నిధులు ఉన్నాయని, అభివృద్ధి పనులకు కేటాయిస్తామని పేర్కొన్న సంగతి తెలిసిందే. రానున్న ఆర్నెళ్ల వ్యవధిలో చైర్మన్ ఎన్నికకు నోటిఫికేషన్ విడుదల చేయనున్న నేపథ్యం ఉత్కంఠను కలిగిస్తోంది. ఇటువంటి ఉత్కంఠ పరిస్థితుల నేపథ్యంలో జడ్‌పి చైర్మన్ ఎన్నిక ప్రక్రియలో వైసిపి జడ్‌పిటిసిల్లో నెలకొన్న అసంతృప్తి సెగలు ఎక్కడ దెబ్బ తీస్తాయోననే భయంతో పనుల పందేరానికి తెరతీసినట్లు సమాచారం. ఉమ్మడి కడప జిల్లాలోని 51 మంది జడ్‌పిటిసిలకు ఒక్కొక్కరికీ రూ.10 లక్షల చొప్పున రూ.5.10 కోట్లు కేటాయించినట్లు తెలుస్తోంది. పలువురు జడ్‌పిటిసిలు ఏయే పనులకు ఏమేరకు కేటాయింపులనే అంశంపై జిల్లా పరిషత్‌కు చేరుకుని చేర్పులు, మార్పులు చేసుకుంటున్న వైనం కనిపిస్తోంది. ఐసిడిఎస్ డిపార్టుమెంట్ పరిధిలోని అంగన్వాడీ భవన నిర్మాణాలు, గ్రావెల్ రోడ్లు ఇతర పనులకు సంబంధించిన పనులపై పలువురు దృష్టి సారించినట్లు తెలుస్తోంది. జడ్‌పి జనరల్ ఫండ్స్ కేటాయింపు వ్యవహారం ఇలా ఉండగా జనరల్ ఫండ్స్ ఉన్నంత మాత్రానా సరిపోదని, ప్రభుత్వ అప్రూవల్ పొందిన అనంతరం నిధులు ఖాతాలో జమపడాల్సి ఉందని, తమ ప్రభుత్వ హయాంలో ఇటువంటి సమస్య నెలకొన్న కారణంగానే ఎలాంటి అభివృద్ధి పనులు చేపట్టలేక పోయామనే వాదన వినిపిస్తుండడం గమనార్హం. ప్రస్తుతం రాష్ట్రంలో కూటమి సర్కారు అధికారం చేపట్టిన నేపథ్యంలో వైసిపి జడ్‌పిటిసిలు పనులు చేయడంతోనే సరిపోదని, చేసిన పనులకు సంబంధించిన చెల్లింపుల సమస్యను ఎదుర్కొనాల్సి వస్తుందనే హెచ్చరికలు వినిపిస్తుండడం గమనార్హం.

ఓపెన్ స్కూల్ అడ్మిషన్ల ప్రక్రియ వేగవంతం

- డిఇఒ శివప్రకాష్‌రెడ్డి

ప్రజాశక్తి-రాయచోటి

సమావేశంలో మాట్లాడుతున్న డిఇఒ శివప్రకాష్‌రెడ్డి

ఓపెన్ స్కూల్ అడ్మిషన్ల ప్రక్రియను వేగవంతం చేయాలని జిల్లా విద్యాశాఖ అధికారి శివప్రకాష్‌రెడ్డి పిలుపునిచ్చారు. మంగళవారం పట్టణంలోని డైట్ స్కూల్ హాల్లో జిల్లా ఓపెన్ స్కూల్ ఎఐ కో-ఆర్డినేటర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డిఇఒ మాట్లాడుతూ ఓపెన్ స్కూల్ పరీక్షల ద్వారా 14 సంవత్సరాలు వారు చదవగలిగిన, రాయదగిని, పదవ తరగతి ఫెయిల్ అయినా చదువు మధ్యలో మానేసిన వారికి ఓపెన్ స్కూల్ ద్వారా పదవ తరగతి చదువుకునే అవకాశం ఉందన్నారు. ఇంటర్ చదువు కోవాలనుకున్న వారు 15 సంవత్సరాలు నిండిన, ఇంటర్ ఫెయిల్ అయిన మధ్యలో చదువు మానేసిన వారు ఓపెన్ స్కూల్ ద్వారా ఇంటర్మీడియట్ చదువుకునే అవకాశం ఉందన్నారు. ఓపెన్ స్కూల్ అనేది సరళమైన సార్వత్రిక విద్యా విధానం ద్వారా మహిళలు వృత్తి విద్యా కోర్సుల్లో ఉండేవారు రాజకీయ నాయకులు పలు రంగాలలో పనిచేసే వారు, వివిధ సంఘాలలో పనిచేసే వారు, సామాజికంగా ఆర్థికంగా వెనుకబడిన వారికి ఈ ఓపెన్ స్కూల్ పరీక్షలు అనేవి ఒక గొప్ప సదవకాశమన్నారు. అనంతరం ఓపెన్ స్కూల్స్ రాష్ట్ర పరిశీలకులు అక్బర్ అలీ మాట్లాడుతూ ఓపెన్ స్కూల్ చదివేవారికి సెలవు దినాల్లో తరగతులు ఉంటాయని, ప్రభుత్వమే సరళమైన భాషలో స్వీయ బోధన కోసం తయారు చేసిన పుస్తకాలు అందజేస్తుందని చెప్పారు. మహిళలు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలు, విభిన్న ప్రతిభావంతులతోపాటు మాజీ సైనిక ఉద్యోగులకు అడ్మిషన్ ఫీజులో రాయితీ ఉంటుందన్నారు. అభ్యాసకులు ఓపెన్ స్కూల్లో ప్రవేశం పొందినప్పటి నుంచి ఐదు సంవత్సరాల లోపు తొమ్మిది పర్యాయాలు పరీక్షలకు హాజరయ్యే సౌలభ్యం ఉందన్నారు. అనంతరం జిల్లా ఓపెన్ స్కూల్ కో -ఆర్డినేటర్ కొండూరు శ్రీనివాసరాజు మాట్లాడుతూ ఓపెన్ స్కూల్లో ప్రవేశం పొందాలనుకునే అభ్యర్థులకు రిజిస్ట్రేషన్ ఫీజు రూ.200 లతో పాటు అడ్మిషన్ ఫీజు జనరల్ కేటగిరి అభ్యర్థులకు రూ.1400, మహిళలు ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనార్టీలు, మాజీ సైనిక ఉద్యోగులకు రూ.900 ఉంటుందన్నారు. అలాగే అడ్మిషన్ ఫీజు రాయితీ పొందే వారు సంబంధిత ధ్రువీకరణ పత్రాలను అప్లికేషన్‌లో అప్లోడ్ చేయాలని ఆయన సూచించారు. పరీక్షకు హాజరయ్యే వారికి ప్రతి సబ్జెక్టుకు రూ.100 పరీక్ష ఫీజు ఉంటుందని, విభిన్న ప్రతిభావంతుల విద్యార్థులకు పరీక్ష ఫీజులో రాయితీ ఉంటుందన్నారు. అనంతరం ఐఇడి కో-ఆర్డినేటర్ జనార్దన్ మాట్లాడుతూ ఓపెన్ స్కూల్ పరీక్షలలో క్రెడిట్ ఆక్యుములేషన్ పరీక్ష విధానం ఉంటుందన్నారు. పరీక్షకు హాజరయ్యే అభ్యాసకులు వారి సౌలభ్యం మేరకు ఒక సబ్జెక్టు లేక రెండు సబ్జెక్టులు పరీక్షకు హాజరు కావచ్చునని, వారికి ఇచ్చిన ఐదు సంవత్సరాల గడువులోపు అన్ని సబ్జెక్టులు పాసైన వెంటనే సర్టిఫికెట్ అందజేస్తారన్నారు. పరీక్షలు సంవత్సరంలో రెండు పర్యాయాలు ఉంటాయని మార్చి, ఏప్రిల్‌లో ఒకసారి, జూన్, జూలై మాసాలలో రెండవసారి ఉంటాయని తెలిపారు. కావున అభ్యాసకులు ఓపెన్ స్కూల్ పరీక్షలను సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. అనంతరం డైట్ ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ అజయ్ కుమార్ మాట్లాడుతూ ఎంతో మంది చదువు మధ్యలో మానేసిన వారికి, పాఠశాలలకు వెళ్లి చదువుకునే అవకాశం లేని వారికి, ఇతర వృత్తులలో ఉన్న వారికి, వివిధ సంఘాలలో పనిచేసే వారికి, ఇంటి వద్ద నుండి చదువుకునే వారికి, సెలవులలో చదువుకునే వారికి ఈ ఓపెన్ స్కూల్ పరీక్షలు అనేవి చాలా ఉపయోగపడతాయన్నారు.

విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న సాయి చరణ్‌రెడ్డి

'మిట్స్'లో ఉపాధి అవకాశాలపై అవగాహన

ప్రజాశక్తి-మదనపల్లి

మిట్స్ ఇంజినీరింగ్ కళాశాలలో ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజినీరింగ్ విభాగం కోర్ కంపెనీల్లో ఇఇఇ విద్యార్థులకు అవకాశాలపై అవగాహన సదస్సును నిర్వహించినట్లు ప్రిన్సిపల్ డాక్టర్ యువరాజ్ తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై బెంగళూరు ఎల్అండ్‌టి టెక్నాలజీ సర్వీస్ లిమిటెడ్ ఇన్వర్టర్ ఇంజనీర్, కళాశాల పూర్వ విద్యార్థి సాయి చరణ్‌రెడ్డి మాట్లాడుతూ ప్రస్తుతం ఉన్న మార్కెట్‌లో ఇఇఇ విద్యార్థులకు మంచి ఉద్యోగ అవకాశాలు ఉన్నాయని తెలిపారు. విద్యార్థులు వాటి గురించి తెలుసుకోవాలన్నారు. ఎలక్ట్రికల్ విద్యార్థులు విద్యుత్ ఉత్పత్తి, పంపిణీ, ఎలక్ట్రానిక్స్, సెమీకండక్టర్ పరిశ్రమ, ఆటోమేషన్, కంట్రోల్ సిస్టమ్స్, టెలికమ్యూనికేషన్స్ రంగాలపై దృష్టి సాధించాలని పేర్కొన్నారు. ఆయా రంగాలలో మెరుగుగా ఉద్యోగ అవకాశాలు ఉన్నాయని తెలిపారు. విద్యార్థులు ఎలక్ట్రికల్ సర్క్యూట్‌లు, కంట్రోల్ సిస్టమ్స్, పవర్ సిస్టమ్స్, ఎలక్ట్రానిక్స్‌లో సాంకేతిక నైపుణ్యాలను పెంపొందించుకోవాలని చెప్పారు. మాట్లాబ్, సిములింక్, పిస్పైస్, ఆటోకాడ్ మొదలైన వాటిలో సాఫ్ట్‌వేర్ నైపుణ్యంను పెంపొందిచుకోవాలని పేర్కొన్నారు. విద్యార్థులు జాతీయ స్థాయిలో నిర్వహించే గేట్ పరీక్షల్లో ఉతీర్ణులైతే ప్రభుత్వ ఉద్యోగాలు త్వరితగా లభిస్తాయన్నారు. కార్యక్రమంలో డాక్టర్ ఎ.వి.పవన్ కుమార్, విభాగాధిపతి, వెంకటేష్, సహాయ ఆచార్యులు, ఇఇఇ విభాగం అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు జాతీయ చేనేత దినోత్సవ ర్యాలీ

ప్రజాశక్తి -రాయచోటి

జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా చేనేతపై అవగాహన కల్పించేందుకు బుధవారం ఉదయం 9 గంటలకు ర్యాలీ నిర్వహించనున్నట్లు జిల్లా చేనేత, వస్త్ర శాఖ అధికారి శ్రీదేవి ఒక ప్రకటనలో తెలిపారు. కలెక్టర్ శ్రీధర్ చామకూరి, జిల్లా చేనేత, వస్త్ర శాఖ అధికారి కార్యాలయం నుంచి జండా ఊపి ప్రారంభిస్తారని పేర్కొన్నారు. ఆ శాఖ సిబ్బంది, 200 మంది పైగా చేనేత కార్మికులు పాల్గొంటారని తెలిపారు. ఆగస్టు 7, 1905న ప్రారంభించబడిన స్వదేశీ ఉద్యమం, దేశీయ పరిశ్రమలను, ముఖ్యంగా చేనేత కార్మికులను ప్రోత్సహించిందన్నారు. ఈ నేపథ్యంలోనే చేనేత రంగం ప్రాముఖ్యతను గురించి ప్రజలకు అవగాహన కల్పించడానికి, చేనేత మీద ఆధారపడి జీవిస్తున్న ఎంతోమంది చేనేత కార్మికుల సేవలను గుర్తించడానికి ప్రతి సంవత్సరం ఆగస్టు 7న జాతీయ చేనేత దినోత్సవాన్ని జరుపుకుంటున్నామన్నారు.

దళితుల జోలికొస్తే ఊరుకోం

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

ఎవరైనా దళితుల జోలికొస్తే ఊరుకోమని ఎపి ఎంఆర్‌పిఎస్, మాల మహానాడు నాయకులు హెచ్చరించారు. సోమవారం కొందరు టిడిపి నేతలు మున్సిపల్ కమిషనర్ రాంబాబుతో తొలగించిన మున్సిపల్ కార్మికులను తిరిగి విధులలోకి తీసుకోవాలని డిమాండ్ చేస్తూ ఒత్తిడి చేయడంతో మంగళవారం దళిత సంఘాల నేతలు ఆగ్రహించి ఆర్అండ్‌బి అతిథి గృహం వద్ద గల అంబేద్కర్ విగ్రహం వద్ద నల్లరిబ్బన్లు ధరించి నిరసన తెలిపి అనంతరం అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా దళిత నాయకులు మాట్లాడుతూ దళిత సామాజిక వర్గానికి చెందిన మున్సిపల్ కమిషనర్ రాంబాబుపై టిడిపి నాయకుల దౌర్జన్యం అధికార మదమని ఆగ్రహం వ్యక్తం చేశారు. దళితులపై దౌర్జన్యాలకు పాల్పడితే సహించబోమని, మున్సిపల్ కమిషనర్‌పై జరిగిన దౌర్జన్యాన్ని జాతీయ మానవ హక్కుల కమిషన్ దృష్టికి తీసుకెళ్ళనున్నట్లు తెలిపారు. కమిషనర్‌పై దౌర్జన్యానికి పాల్పడిన టిడిపి నాయకులపై వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం జరిగిన ఘటనపై అర్బన్ సిఐ మద్దయ్య ఆచారి, సబ్ కలెక్టర్ కార్యాలయంలోని పరిపాలనాధికారిని సుజాతకు ఫిర్యాదు అందజేశారు. కార్యక్రమంలో దళిత సంఘ నాయకులు జీరోపల్లి భాస్కర్, సత్యాల రామకృష్ణ, దండు గోపి, ఎపి ఎంఆర్‌పిఎస్ నాయకులు బొజ్జ పెంచలయ్య, గొంటు మణి, శ్రీనివాసులు, శేఖర్, బాబు, మాలమహానాడు నాయకులు పాల్గొన్నారు.

నిరసన తెలుపుతున్న దళిత సంఘాల నేతలు

పక్కాగా పశుగణన నిర్వహించాలి

- పశుసంవర్ధక శాఖ జిల్లా అధికారి గుణశేఖర్

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

సమావేశంలో మాట్లాడుతున్న గుణశేఖర్

ఐదేళ్ల తర్వాత పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో చేపట్టిన పశు గణన కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ వారి పరిధిలో పక్కాగా నిర్వహించి లెక్కలు తేల్చాలని పశుసంవర్ధక శాఖ జిల్లా అధికారి గుణశేఖర్ పిళ్లై ఉపసంచాలకులు విజయభాస్కర్ తెలిపారు. మంగళవారం రాజంపేట ఎంపిడిఒ కార్యాలయ సభావనంలో రాజంపేట, రైల్వేకోడూరు నియోజవర్గంలోని ఏడు మండలాలకు సంబంధించిన పశు వైద్యాధికారులు, ఎన్యూమరేటర్లకు పశుగణనపై ప్రత్యేక శిక్షణ తరగతులు నిర్వహించి పశుగణనలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా గుణశేఖర్ మాట్లాడుతూ 2019లో 20వ పశు గణన జరిగిందన్నారు. ఇప్పుడు మళ్లీ ఐదేళ్ల తర్వాత సెప్టెంబర్ ఒకటో తేదీ నుంచి 21వ తేదీ వరకు పశుగణన చేపట్టేందుకు ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు చేసిందని పేర్కొన్నారు. పశు వైద్యాధికారులు, సిబ్బంది అందరూ వారి వారి పరిధిలోని ఇళ్లను సందర్శించి పశువులు, కోళ్లు, గొర్రెలు, మేకలు, పందులు, పెరటి కోళ్ల, పాలిచ్చే పశువులు, కుక్కలు, పెంపుడు కుక్కలు దాదాపు 15 అంశాలపై సమగ్ర వివరాలు సేకరించాలన్నారు. తద్వారా పాలు, గుడ్లు, మాంసం, ఇతరత్రా దిగుబడి ఎంత ఉందనేది ఈ గణాంకల ద్వారా తెలుస్తోందని చెప్పారు. సచివాలయాల్లోని పశుసంవర్ధక సహాయకులు కూడా ఈ సర్వేలో పాల్గొని పశుగణ చేపట్టాలని తెలిపారు. అఖిల భారత పశుగణన పక్కగా నిర్వహించేందుకు ఘన కులపు శిక్షణ కూడా ఇస్తున్నామని తెలిపారు. వివరాలన్నీ ఆన్‌లైన్‌లో నిక్షిప్తం చేస్తామని వివరించారు. కార్యక్రమంలో పశుసంవర్ధక శాఖ రాజంపేట సహాయ సంచాలకులు ప్రతాప్, రైల్వేకోడూరు సహాయ సంచాలకులు సురేష్ రాజులతోపాటు ఏడు మండలాలకు చెందిన పశువైద్య శాఖ అధికారులు, ఎన్యుమరేటర్లు పాల్గొన్నారు.

ర్యాగింగ్ చట్టరీత్యా నేరం : డిఎస్‌పి

మాట్లాడుతున్న డిఎస్‌పి కొండయ్య నాయుడు

ప్రజాశక్తి-మదనపల్లి

ర్యాగింగ్ చేయడం చట్టరీత్యా నేరమని, ఇలాంటి చెడు సంప్రదాయానికి స్వస్తి పలికి మంచి భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలని డిఎస్‌పి కొండయ్య నాయుడు అన్నారు. మంగళవారం స్థానిక ఆదిత్య ఇంజినీరింగ్ కళాశాలలో యాంటీ ర్యాగింగ్, యాంటీ డ్రగ్ కంట్రోల్ అవగాహన కార్యక్రమాన్ని కళాశాల డైరెక్టర్ డాక్టర్ రామలింగారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా డిఎస్‌పి కొండయ్య నాయుడు మాట్లాడుతూ విద్యార్థులు డ్రగ్స్ వాడకూడదని దానివల్ల ఆరోగ్యం క్షీణిస్తుందని భవిష్యత్తు అంధకారంలోకి వెళ్తుందని తెలిపారు. డ్రగ్స్ వాడటం వలన జైలు శిక్ష అనుభవించాల్సిన అవసరం వస్తుందని చెప్పారు. కొత్తగా కాలేజీకి వస్తున్న జూనియర్ విద్యార్థులను రాగింగ్ చేయకూడదని చెప్పారు. వారిని సోదర భావంతో ఆహ్వానించాలన్నారు. ఒకవేళ ఏ విద్యార్థి అయినా ర్యాగింగ్‌కు పాల్పడితే జైలు శిక్ష అనుభవించాల్సి వస్తుందని హెచ్చరించారు. విద్యార్థులందరితో ర్యాగింగ్ చేయమని డ్రగ్స్ వాడకూడదని వాగ్దానం చేపించారు. ఆదిత్య కళాశాల డ్రగ్స్ రహిత, ర్యాగింగ్ రహిత కళాశాలని అభినందించారు. కళాశాల డైరెక్టర్ డాక్టర్ ఎస్.రామలింగారెడ్డి మాట్లాడుతూ ప్రతి విద్యార్థి చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని తెలిపారు. డ్రగ్స్ లాంటి మా దగ్గర ద్రవ్యాలకు దూరంగా ఉండాలన్నారు. డ్రగ్స్ వలన విద్యార్థి మనోధైర్యాన్ని కోల్పోయి ఆరోగ్యం క్షీణిస్తుందని తెలిపారు. దానివల్ల తమ తల్లిదండ్రులు ఎంతో బాధపడతారన్నారు. ర్యాగింగ్‌కు దూరంగా ఉండాలని ర్యాగింగ్‌కి పాల్పడితే జైలు శిక్ష అనుభవించాల్సి వస్తుందని తెలిపారు. విద్యార్థులు నాలుగేళ్లు క్రమశిక్షణతో మెలగాలని, తల్లిదండ్రులను గౌరవించాలని, అధ్యాపకులకు, కళాశాలకు మంచి పేరు తీసుకురావాలని పేర్కొన్నారు. భవిష్యత్తులో మరింత ముందుకు వెళ్లాలని తెలిపారు. కార్యక్రమంలో మదనపల్లి పట్టణ సిఐ శేఖర్, హెడ్‌కానిస్టేబుల్ రామ్మూర్తి పాల్గొన్నారు.

రూ.1.40 కోట్ల నిధులు దుర్వినియోగం

- సర్పంచ్, ఇన్‌ఛార్జి సర్పంచ్, ముగ్గురు అధికారులకు షోకాజ్ నోటీసులు
- 15 రోజుల్లోగా వివరణ ఇవ్వకుంటే చట్టపరమైన చర్యలు
- మీడియా సమావేశంలో ఎంపిడిఒ ఉపేంద్రారెడ్డి, ఇఒ గురుమోహన్

ప్రజాశక్తి-పీలేరు

పీలేరు మేజర్ గ్రామ పంచాయతీలో నిధుల దుర్వినియోగంపై వచ్చిన ఆరోపణలతో పీలేరు ఎమ్మెల్యే నల్లారి కిషోర్ కుమార్‌రెడ్డి ఫిర్యాదు మేరకు కలెక్టర్ శ్రీధర్ విచారణకు ఆదేశించారు. మదనపల్లి డిఎల్‌పిఒ నాగరాజ ఆధ్వర్యంలో ఐదుగురు సభ్యుల బృందం జూన్ 5 నుండి సుమారు 20 రోజుల పాటు విచారణ చేపట్టి, ఆ నివేదికను కలెక్టరుకు అందజేశారు. కలెక్టర్ కార్యాలయం నుంచి అందిన ఆదేశాల మేరకు ఆ నివేదికపై ఎంపిడిఒ ఉపేంద్రారెడ్డి, ఇన్‌ఛార్జి ఇఒ గురుమోహన్ మంగళవారం విలేకరుల సమావేశం నిర్వహించి వివరాలు వెల్లడించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అధికారుల బృందం అందించిన నివేదిక ఆధారంగా రూ.1,40,43,714 పంచాయతీ నిధులు దుర్వినియోగమైందని చెప్పారు. ప్రస్తుత పాలకవర్గం హయాంలో వారు పంచాయతీ నియమ, నిబంధనలను పాటించకుండా ప్రజా ప్రతినిధులైన సర్పంచ్, ఇన్‌ఛార్జి సర్పంచ్‌గా వ్యవహరిస్తున్న ఉపసర్పంచ్‌ల పరిపాలనలో గ్రామ పంచాయతీకి అవసరమైన వివిధ రకాల సామాగ్రి కొనుగోలు, నాణ్యతలేని పలు నిర్మాణం పనులు, వాహనాలకు పట్టించిన డీజిల్, పెట్రోలు, అవసరానికి మించి సిబ్బంది నియామకాలు, వారికి వేతనాలు వేతనాలు చెల్లింపులు మొదలకు మార్గాల్లో అవినీతి జరిగినట్లుగా విచారణ బృందం ధ్రువీకరించిందని పేర్కొన్నారు. సెలవులో ఉన్న సర్పంచ్ డాక్టర్ షేక్ హబీబ్ బాష, ఇన్‌ఛార్జి సర్పంచ్ జీనత్‌షఫీ హయాంలలో రూ.1.40 కోట్ల మేర నిధులు దుర్వినియోగమైనట్లు నిర్ధారించారన్నారు. జిల్లా ఉన్నతాధికారులు వారితో పాటు వారి హయాంలలో పీలేరు పంచాయతీ ఇఒలుగా పని చేసిన జెఎస్ఆర్ఒ ప్రసాద్, కెఆర్.ప్రసాద్, ఎస్.ఎ. గఫూర్ ఆయా నిధుల వినియోగానికి సంబంధించిన సరైన రికార్డులతో 15 రోజుల్లోగా వివరణ ఇవ్వాలని, వివరణ ఇవ్వకపోతే చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటారని తెలిపారు. సెలవులో ఉన్న సర్పంచ్ హబీబ్ బాషా అందుబాటులో లేకపోవడంతో ఆయనకు ఫోను ద్వారా నోటీసులు జారీ చేశామని, మిగిలిన వారికి వ్యక్తిగతంలో నోటీసులు అందించినట్లు తెలిపారు. 2021-23 ఆర్థిక సంవత్సరం నుంచి 2023-24 ఆర్థిక సంవత్సరం వరకు జరిగిన నిధుల వినియోగంపై విచారణ జరిపినట్లు తెలిపారు. అధికారులు ధ్రువీకరించిన మేరకు సెలవులో ఉన్న సర్పంచ్ జెఎస్ఆర్ఒ ప్రసాద్ హయాంలో రూ.80,74,184 దుర్వినియోగమైనట్లు విచారణలో తేలిందన్నారు. ప్రస్తుత సర్పంచ్ షేక్ జీనత్ షఫీ, కార్యదర్శులు కెఆర్.ప్రసాద్, ఎస్ఎ.గఫూర్ పాలనలో రూ.59,69,530 దుర్వినియోగమైనట్లు తేలిందన్నారు. ఈ ఇరువురు పగ్గాలు చేపట్టినప్పటి నుంచి ప్రస్తుత పాలవకర్గం నిబంధనలన్నింటినీ పక్కన పెట్టి తమ ఇష్టానుసారం పనులు చేపట్టడం, బిల్లులు చెల్లించారన్నారు. 2021-22 ఆర్థిక సంవత్సరంలో అధికారులు విచారించిన 39 అంశాలలో ఏ ఒక్కదానికి కూడా ఎటువంటి ముందస్తు అనుమతులు తీసుకోలేదని, చేసిన పనులకు ఎంబుక్కులు సరిగ్గా రికార్డు చేయలేదని అధికారులు కనుగొన్నారు. 2022-23 ఆర్థిక సంవత్సరంలో పరిశీలించిన 32 అంశాలు, 2023-24 ఆర్థిక సంవత్సరంలో పరిశీలించిన 44 అంశాలకు కూడా ఎటువంటి ముందస్తు అనుమతులు లేవని అధికారుల విచారణలో తేలిందన్నారు. ఆయా విచారణల్లో మరిన్ని అవకతవకలు వెలుగుచూసే అవకాశం ఉంది.

ఎన్‌సిసి విద్యార్థులతో ఎంఇఒ, ఉపాధ్యాయులు

ఎన్‌సిసి గది ప్రారంభం

ప్రజాశక్తి-పీలేరు

ఉపాధ్యాయుల సాయంతో ఎన్‌సిసి గదిని ప్రారంభించుకోవడం స్ఫూర్తిదాయకమని మండల విద్యాశాఖ అధికారి లోకేశ్వర్‌రెడ్డి తెలిపారు. పీలేరు జిల్లా పరిషత్ ప్రధాన ఉన్నత పాఠశాలలో నిర్మించిన గదిని మంగళవారం ఎంఇఒ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఆర్.సురేంద్రనాథ్‌రెడ్డి, ఉపాధ్యాయులు, ఇ.రవీంద్రనాథ్‌రెడ్డి, ఎన్.వెంకటేశ్వరరెడ్డి రూ.2 లక్షలు తమ సొంత నిధులు ఖర్చు చేసి అన్ని సౌకర్యాలతో విద్యార్థులకు అందుబాటులోకి ఎన్‌సిసి గదిని నిర్మించినందుకు ఆయన అభినందించారు. కొత్తగా నిర్మించిన ఎన్‌సిసి గదిని పీలేరు మండల విద్యాశాఖ అధికారి లోకేశ్వర్‌రెడ్డి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఆర్.సురేంద్రనాథ్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు మంచి క్రమశిక్షణతో ఈ గొప్ప అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఎన్‌సిసి ద్వారా క్రమశిక్షణ, సహకారం, సేవాభావం, సహనం నేర్పుతుందన్నారు. ఎన్‌సిసి కోటాలో విద్యార్థులు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ సంస్థల్లో ఉన్నత విద్యా కోర్సుల్లో సీట్లు పొందవచ్చని చెప్పారు. కార్యక్రమంలో ఎన్‌సిసి ఆఫీసర్ ఎన్.జైపాల్‌రెడ్డి, ఎన్‌సిసి కెడిట్‌లు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

10న ఉద్యోగుల సమస్యలపై ప్రాంతీయ సదస్సు

ప్రజాశక్తి - రాయచోటి టౌన్

మాట్లాడుతున్న మల్లికార్జున

మున్సిపల్ ఉద్యోగుల ప్రధాన సమస్యలపై ఈ నెల 10వ తేదీ అనంతపురం విద్యానగర్ సంపలత కమ్యూనిటీ హాల్‌లో ప్రాంతీయ సదస్సును జయప్రదం చేయాలని మున్సిపల్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మల్లికార్జున పిలుపు నిచ్చారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ మున్సిపల్ ఉద్యోగులు కొన్ని ఏళ్లుగా ప్రధాన సమస్యలపై పోరాడుతున్నారని ఈ ప్రతీయ సదస్సుకు రాష్ట్ర అధ్యక్షులు కృష్ణ మోహన్‌రావు అధ్యక్షతన ఏర్పాటు చేశామని చెప్పారు. రాయలసీమ మున్సిపల్ ఉద్యోగుల ప్రాంతీయ సదస్సుకు ఉమ్మడి కడప జిల్లాతో పాటు, ఉమ్మడి కర్నూల్, చిత్తూరు, అనంతపురం జిల్లాల్లోని అన్ని మున్సిపాలిటీల మినిస్ట్రీరియల్ సిబ్బంది, పరిపాలనా కార్యదర్శులు తప్పక హాజరై జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమానికి పురపరిపాలన శాఖ అనంతపురం ప్రాంతీయ సంచాలకులు పివివిఎస్ మూర్తి, ఇతర అధికారులు హాజరగుతున్నట్లు తెలిపారు.

యువత కోసం ఎల్‌ఐసి నూతన పాలసీలు

ప్రజాశక్తి - కడప అర్బన్

దేశంలోని 18-45 సంవత్సరాల వయసున్న యువత అవసరాలకు అనుగుణంగా ఎల్‌ఐసి కొత్తగా యువ టర్మ్ పాలసీ, యువ డిజి టర్మ్ పాలసీ, యువ క్రెడిట్ లైఫ్ పాలసీ, యువ డిజీ క్రెడిట్ లైఫ్ పాలసీలను మంగళవారం ప్రారంభించిందని కడప సీనియర్ డివిజనల్ మేనేజర్ రవికుమార్ తెలిపారు. మంగళవారం ఎల్‌ఐసి కార్యాలయంలో పోస్టర్లు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డివిజన్‌లో తొలిరోజే అన్ని బ్రాంచిలలో, సాటిలైట్ ఆఫీసుల్లో మంచి స్పందన లభించిందన్నారు. ఈ పాలసీలను టర్మ్ పాలసీలుగా, క్రెడిట్ లైఫ్ (మార్టగేజ్) పాలసీలుగా అందిస్తున్నామని చెప్పారు. తక్కువ ప్రీమియంతో, రూ.5 కోట్ల గరిష్ట బీమా మొత్తంతో ఆన్‌లైన్, ఆఫ్ లైన్ పద్ధతిలో అందుబాటులో ఉంటాయన్నారు. ప్రీమియం చెల్లింపు వ్యవధి 15 ఏళ్ల నుంచి, 40 సంవత్సరాల వరకు ఎంచుకోవచ్చని అన్నారు. గరిష్ట మెచూరిటీ వయసు 75 ఏళ్లకు మించరాదని అన్నారు. సింగిల్ ప్రీమియం, సంవత్సర, అర్ధ సంవత్సర కంతుల్లో ప్రీమియం చెల్లించవచ్చని పేర్కొన్నారు. నేటి యువత ఇఎంఐలు కడుతూ హౌస్ లోన్, కార్ లోన్ తీసుకోవడం పరిపాటిగా మారిందని వీరికి ఈ పాలసీలు కొలాటరల్ సెక్యూరిటీగా పనికొస్తాయన్నారు. కార్యక్రమంలో మార్కెటింగ్ మేనేజర్ శ్యామ్ సుందర్ రావ్, సేల్స్ మేనేజర్ సాల్మన్ రాజు, ప్రోడక్ట్ మేనేజర్ రామకృష్ణ, ఇతర మేనేజర్లు సత్య ప్రసాద్, రాము నాయక్, సంఘాల ప్రతినిధులు చంద్రపాల్ , రఘునాథ రెడ్డి పాల్గొన్నారు.

కరపత్రాలు ఆవిష్కరిస్తున్న డివిజనల్ మేనేజర్ రవికుమార్, ఇతర సిబ్బంది

ఎమ్మెల్యే శ్రీధర్‌ను సన్మానిస్తున్న సర్పంచ్‌లు, ఎంపిటిసిలు

అభివృద్ధి పనులు వేగవంతం చేయండి : ఎమ్మెల్యే

ప్రజాశక్తి-రైల్వేకోడూరు

మండలంలో అభివృద్ధి పనులు వేగవంతం చేయాలని ఎమ్మెల్యే అరవ శ్రీధర్ అన్నారు. మంగళవారం మండల సభ భవనంలో ఎంపిడిఒ కెవి.సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వైస్ ఎంపిపి రామిరెడ్డి ధ్వజారెడ్డి, జడ్‌పిటిసి సభ్యులు పాలెంకోట రత్నమ్మ హాజరయ్యారు. సర్పంచులు, ఎంపిటిసిలు ఎమ్మెల్యే శ్రీధర్‌ను దుశ్శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శ్రీధర్ మాట్లాడుతూ ఎన్నికల ముందు కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలలో భాగంగా ప్రజలకు ప్రభుత్వ పథకాలను, అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టడంలో అలసత్వం వహించకూడదని పేర్కొన్నారు. వివిధ శాఖల అధికారులు ఆయా శాఖల ద్వారా మండలంలో జరుగుతున్న పనుల గురించి సమావేశంలో వివరించారు. సమావేశానికి ముందు సిఐలు సురేంద్ర నాథ్ రెడ్డి, టి.బాబు, ఎస్ఐ డాక్టర్ నాయక్ పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసి సర్పంచులు, ఎంపిటిసిలు సభ్యులను, అధికారులను మాత్రమే సమావేశ మందిరానికి అనుమతించారు. మండల సమావేశంలో అధిక సంఖ్యలో వైసిపి ఎంపిటిసిలు,, సర్పంచులు ఉన్నందువల్ల అవాంఛనీయ సంఘటనలు జరగకుండా కలిసి బందోబస్తు ఏర్పాటు చేశారు.

నేడు బాధ్యతలు స్వీకరించనున్న తహశీల్దార్

ప్రజాశక్తి-గాలివీడు

కలికిరిలో తహశీల్దార్‌గా విధులు నిర్వహిస్తున్న భాగ్యలత బుధవారం గాలివీడు తహశీల్దార్‌గా తీసుకోనున్నారు. ఇక్కడ పనిచేసిన తహశీల్దార్ ఎం.శ్రీనివాసులు నంద్యాల కలెక్టరేట్ నుంచి ఇక్కడ ఎన్నికల విధులు నిర్వహించి తిరిగి బదిలీపై నంద్యాలకు తిరిగి వెళ్లారు.

మామిడి మొక్కలను పరిశీలిస్తున్న ఎంపిడిఒ, ఎపిఒ

ఉద్యాన పంటల సాగుపై మక్కువ చూపాలి

ప్రజాశక్తి-నిమ్మనపల్లె

ఉద్యానవన పంటల సాగుపై రైతులు ఆసక్తి చూపాలని ఎంపిడిఒ షాలెట్ అన్నారు. మంగళవారం నిమ్మనపల్లి పంచాయతీలో జరుగుతున్న ఉద్యానవన పంటల సాగును ఉపాధి హామీ ఎపిఒ రమేష్‌తో కలసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం రైతులను ప్రోత్సహించడానికి, వ్యవసాయపరంగా వారిని ఆదుకోవడానికి అనేక ప్రోత్సాహకాలను కల్పిస్తున్నాదని అన్నారు. అందులో భాగంగానే మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా పూలతోటలు, పండ్ల తోటలు, కొబ్బరి తోటలను సాగు చేయడానికి రైతులకు అన్ని విధాల సహకరిస్తున్నాదని అన్నారు. ఐదు ఎకరాల లోపు భూమి కలిగిన చిన్నా, సన్నకారు రైతులకు మూడు ఎకరాల వరకు పూల, పండ్ల తోటలను సాగు చేసుకోవడానికి ఉపాధి హామీ పథకం ద్వారా మొక్కలు నాటడానికి, గుంతలను తవ్వించడం, వంటి వాటితో పాటు మొక్కలను ఉచితంగా ప్రభుత్వమే ఇస్తుందన్నారు. మూడు సంవత్సరాల వరకు నాటిన మొక్కలను సంరక్షించుకోవడానికి, తోటలో అంతర్ పంటలను సాగు చేయడానికి లక్ష రూపాయల వరకు నిధులను అందించనున్నట్లు వివరించారు. ఇప్పటివరకు నిమ్మనపల్లె, తవ్వళం గ్రామాలలో సుమారు 26 ఎకరాల విస్తీర్ణంలో మామిడి, దానిమ్మ, కొబ్బరి వంటి మొక్కలతో పాటు ఇతర మొక్కలను నాటడం జరిగిందన్నారు. మండలంలో ఇంకా పది పంచాయతీలలోనూ సుమారు 75 ఎకరాల విస్తీర్ణంలో మామిడి, అల్లనేరేడు, దానిమ్మ, కొబ్బరి వంటి మొక్కలను నాటడానికి మంజూరు చేయడం జరిగింద న్నారు. త్వరలోనే అన్ని పంచాయతీలలో మొక్కలు నాటడం పూర్తి చేస్తామని తెలిపారు. ప్రస్తుతం వర్షాకాలం కావడంతో ప్రభుత్వం రైతులకు సకాలంలో మొక్కలను అందిస్తున్నాదని, మొక్కలు కూడా ఆరోగ్యంగా పెరగడానికి వాతావరణం అనుకూలించడం జరుగుతున్నాదని అన్నారు. ఈ అవకాశాన్ని ఆసక్తి కలిగిన రైతు లందరూ సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో ఎపిఒ రమేష్, ఉపాధి హామీ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

తల్లిపాలపై అవగాహన కల్పిస్తున్న హుస్సేనమ్మ

తల్లి పాలతోనే బిడ్డకు ఆరోగ్యం

ప్రజాశక్తి-రామాపురం

కెవిపల్లి: ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యసిబ్బంది

బిడ్డ పెరుగుదలకు తల్లిపాలు ఎంతో మేలు కలుస్తాయని ఐసిడిఎస్ సూపర్‌వైజర్ హుస్సేనమ్మ అన్నారు. మండలంలోని గువ్వల చెరువు క్లస్టర్ పరిధిలోని కసిరెడ్డిగారిపల్లి పంచాయతీ సూర్యనారాయణపురంలో మంగళవారం అంగన్వాడీ కేంద్రాలలో తల్లిపాలు వారోత్సవాన్ని నిర్వహించారు. బిడ్డకు పుట్టిన మొదట గంటలోనే తల్లిపాలు బిడ్డకు పట్టడం వల్ల బిడ్డకు వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుందని అన్నారు. బిడ్డకు తల్లులు ఏ విధంగా పాలు పట్టాలి అనే విషయంపై గర్భిణులు, బాలింతలకుఅవగాహన కల్పించారు. కార్యక్ర మంలో అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు. **కెవిపల్లి:** ప్రపంచ తల్లిపాల వారోత్సవాల సందర్భంగా గర్నిమిట్ట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారిణి డాక్టర్ రేష్మ ఆధ్వర్యంలో ఆరోగ్య సిబ్బంది గర్నిమిట్ట గ్రామంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ రేష్మ మాట్లాడుతూ తల్లిపాలు బిడ్డకి అమృతంతో సమానమని, కాన్పు తర్వాత వచ్చే ముర్రుపాలలో బిడ్డకి కావలసిన ప్రోటీన్లు, ఇతర పోషకాహాలు చాలా తేలికగా జీర్ణమయ్యేలాగా ఉంటాయని, బిడ్డ యొక్క వ్యాధి నిరోధక శక్తి పెంపొందించడంలో చాలా కీలక పాత్ర పోషిస్తాయని తెలిపారు. బిడ్డలకు ఆరు నెలల పాటు కేవలం తల్లిపాలు మాత్రమే త్రాగించాలని, తర్వాత నుండి అనుబంధ ఆహారాన్ని అందజేస్తూ తల్లిపాలను కొనసాగించవచ్చునని తెలిపారు. తల్లిపాలు తాగడం వలన బిడ్డల శారీరక,మానసిక ఆరోగ్యం చాలా బాగుంటుందని తెలిపారు. పాలిచ్చే తల్లులకు కూడా అనేక ప్రయోజనాలు ఉన్నాయని, కాన్పు తర్వాత గర్భసంచి యధాస్థానానికి రావడానికి ఉపకరిస్తుందని, వారి మానసిక ఆరోగ్యం చాలా బాగుంటారని తెలిపారు.కార్యక్రమంలో పబ్లిక్ హెల్త్ నర్స్ రమాదేవి, ఆరోగ్య పర్యవేక్షకులు రుక్మిణి, పురుషోత్తం, సిహెచ్ఒలు మైత్రి సుధా, మొమిన్ తాజ్, ఆరోగ్య కార్యకర్తలు ఝాన్సీ, సరస్వతి, అలేఖ్య, ఆశాకార్యకర్తలు పాల్గొన్నారు.

మాది కోతల ప్రభుత్వం కాదు

- ఎమ్మెల్యే అరవ శ్రీధర్

ప్రజాశక్తి-రైల్వేకోడూరు

విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శ్రీధర్

కూటమి ప్రభుత్వం గత ప్రభుత్వంలాగా కోతల ప్రభుత్వంకాదని చేతల ప్రభుత్వం అని ఎమ్మెల్యే అరవ శ్రీధర్ పేర్కొన్నారు. జనసేన పార్టీ కార్యాలయంలో మంగళవారం విలేకరులతో మాట్లాడుతూ రైల్వే కోడూరు అభివృద్దే ధ్యేయంగా చిత్తశుద్ధితో పని చేస్తున్నామని చెప్పారు. మూడునెలలకే అభివృద్ధి గురించి కథలు చెప్పే నాయకులు మూడు, నాలుగు సార్లు గెలిపిస్తే ఏమి చేశారో ఆత్మ విమర్శ చేసుకోవాలని అన్నారు. రాష్ట్రంలోనే రైల్వే కోడూరును అత్యంత ఆదర్శవంతమయిన నియోజక వర్గంగా తీర్చి దిద్దుతామని పేర్కొన్నారు. జనసేన పార్టీ రాష్ట్ర కార్యదర్శి తాతంశెట్టి నాగేంద్ర మాట్లాడుతూ మాజీ ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు అభివృద్ధి గురించి మాట్లాడడం విడ్డూరంగా ఉందని అన్నారు. తన ఉనికిని కాపాడుకోడానికే అసత్యాలు మాట్లాడుతున్నారని అన్నారు. రూ. 1600 కోట్లు అభివృద్ధికి తెచ్చామ్మన్న వారు ఎక్కడ అభివృద్ధి జరిగిందో ప్రజలకు చూపాలన్నారు. చేసిన పనికి రెండు కోట్లు బిల్లు కూడా చేయించ లేని అసమర్ధపరిపాలన కోరముట్లదని, వీరి కమీషన్ల దెబ్బకు రైల్వే అండర్ బ్రిడ్జి కాంట్రాక్టర్ పరారయ్యాడని అన్నారు. కార్యక్రమంలో జోగినేని మణి, పగడాల వెంకటేష్, సర్పంచ్ సంయుక్త, పగడాల చంద్ర శేఖర్, ఆలం రమేష్, వరికూటి నాగరాజ, పసుపులేటి రమణ, రాగిపాటి విజయ్, ఆలం వెంకటయ్య, రవి, ప్రేమ్ పాల్గొన్నారు.

రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలి : డిఎంహెచ్ఒ

వైద్య సిబ్బందికి సూచనలు ఇస్తున్న డిఎంహెచ్ఒ కొండయ్య

ప్రజాశక్తి - బి.కొత్తకోట

రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని డీఎంహెచ్ఒ డాక్టర్ కొండయ్య వైద్య సిబ్బందిని ఆదేశించారు.మంగళవారం పిటిఎం మండలంలోని కందుకూరు ప్రభుత్వ ఆస్పత్రిని ఆయన సందర్శించారు. పలు రికార్డులను తనిఖీ చేసి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని సూచించారు. సీజనల్ వ్యాధులు, అంటువ్యాధులపై అవగాహన కల్పించాలని తెలిపారు. విధుల పట్ల అలసత్వం వహించరాదని, ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉండి వారిలో ప్రభుత్వ వైద్య సేవలపై మరింత నమ్మకం పెంచాలని తెలిపారు. సాధ్యమైనంత కేసులకు ఇక్కడే వైద్యం అందించాలని, ఇక్కడ సాధ్యం కానీ పక్షంలో జిల్లా ఆస్పత్రి మదనపల్లికి రెఫర్ చేయాలన్నారు. కార్యక్రమంలో పిహెచ్‌సి వైద్యులు డాక్టర్ శంకర్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

నియోజకవర్గ అభివృద్ధే ధ్యేయం : 'ముక్కా'

ప్రజాశక్తి-రైల్వేకోడూరు

మాట్లాడుతున్న ముక్కా రూపానందరెడ్డి

రైల్వేకోడూరు నియోజకవర్గ అభివృద్ధి ప్రభుత్వ ధ్యేయమని టిడిపి ఇన్‌ఛార్జి ముక్కా రూపానందరెడ్డి పేర్కొన్నారు. మండల సమావేశం అనంతరం రూపానందరెడ్డి, ఎమ్మెల్యే అరవ శ్రీధర్ మండల అధికారులతో పరిచయ కార్యక్రమం నిర్వహించారు. ఆయా శాఖల అధికారులు ప్రభుత్వ పథకాలు వివరించారు. అభివృద్ధికి కావాల్సిన పలు విషయాలపై చర్చించారు. అధికారులు గత ప్రభుత్వంలో మొదలుపెట్టి పూర్తికాని పనులు గురించి ప్రస్తావించారు. రెవెన్యూ, ఎంపిడిఒ, పోలీసుశాఖ, ఎడ్యుకేషన్, హౌసింగ్, ఐసిడిసి, ఎలక్ట్రిసిటీ, వెలుగు ఎన్ఆర్ఇజిఎస్, వ్యవసాయ శాఖ, ఇరిగేషన్ శాఖ పలు శాఖ అధికారుల సమావేశంలో పాల్గొని మండలంలోని సమస్యలను, పెండింగ్‌లో ఉన్న పనులను, జరగవలసిన అభివృద్ధి గురించి వివరించారు. అనంతరం రూపానందరెడ్డి, ఎమ్మెల్యే శ్రీధర్ మాట్లాడుతూ ఎన్నికల ప్రచార సమయంలో ప్రజలకు ఇచ్చిన పలు వాగ్దానాలు వాటి పరిష్కార దిశగా అధికారులు అడు గులు వేయాలని అన్నారు. ఎన్నికల ముందు మాత్రమే రాజకీయమని ఆ తర్వాత నియోజకవర్గ అభివృద్ధే ముఖ్యమని అన్నారు. చేస్తున్న పనులలో నాణ్యతను పెంపొందించాలని, అధికారులు సమయపాలన పాటిస్తూ ప్రజలతో జాగ్రత్తగా వ్యవహరించాలని సూచించారు, కార్యక్రమంలో టిడిపి సీనియర్ నాయకులు కట్టా గుండయ్య నాయుడు, జనసేన నాయకులు తాతంశెట్టి నాగేంద్ర, ఎంపిటిసిలు, ఎంపిడిఒ కెవి సుబ్రమణ్యం, ఇఒపిఆర్‌డి నాగార్జున, ఎఒ కామేశ్వరరావు, అధికారులు జడ్‌పిటిసిలు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

వ్యాధి గ్రస్తులను గుర్తించడంలో 'ఆశాల' పాత్ర కీలకం

కలకడ : సమావేశంలో మాట్లాడుతున్న వైద్యాధికారులు

ప్రజాశక్తి- కలకడ

వైద్య సేవలు అందించడంతో పాటు వ్యాధిగ్రస్తులను గుర్తించడంలో ఆశాల పాత్ర కేలకమైనదని ఎర్రకోటపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి ఎన్.వి కిషోర్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని ఎర్రకోటపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆశాడే కార్యక్రమం నిర్వహించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమం గురించి వైద్యా ధికారి మాట్లాడుతూ పిహెచ్‌సిలో గర్భిణులు, బాలింతల నమోదు తక్కువగా ఉందని సచివాలయం వారిగా వారి టార్గెట్‌ను సంపూర్తిగా చేయా లని అన్నారు. ప్రతి అంగన్వాడీ కేంద్రంలో ఆశా కార్యకర్తలు, ఆరోగ్య కార్యకర్తలు, ఎంఎల్‌హెచ్‌పిల దగ్గర ఒఆర్ఎస్ యంప్యాకెట్లు ఉండాలని సూచించారు. 15న కేన్సర్ స్క్రీనింగ్ గ్రామాలలో తప్పక చేయాలని స్క్రీనింగ్ అయిన తర్వాత ఉన్నత స్థాయి కేంద్రాలకు పంపాలని ఆదేశించారు. 20 నుంచి జాతీయ నులిపురుగుల నిర్మూలన కార్యక్రమం ఉంటుందని తెలిపారు. వైద్య సిబ్బంది ప్రతి పాఠశా, అంగన్వాడీ కేంద్రాలలో మధ్యాహ్న భోజనం అనంతరం రెండేళ్ల నుంచి 19 ఏళ్ల వరకు ఆల్బెండజోల్ మాత్రలను తప్పక మింగించాలని సూచించారు. ప్రతి ఒక్కరూ హ్యాండ్ వాష్ గురించి అవగాహన కలిగి ఉండాలన్నారు. మాతా శిశు సంరక్షణ ఎంపిసి కార్డులను సంపూర్ణంగా పూరించాలని అన్నారు. కష్టతరమైన గర్భిణులను ఉన్నత స్థాయి వైద్యశాలకు రెఫరల్ చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపిహెచ్ఇఒ జి.జయ రామయ్య, పిహెచ్ఎన్ కె.సుబ్బరత్నమ్మ ,హెల్త్ సూపర్వైజర్ ఎం.వెంకటేశ్వ రరావు, ఆరోగ్య కార్యకర్తలు ఎన్.వాణి, పి.శ్రీలక్ష్మి, బి.లక్ష్మి, డి.వరలక్ష్మి, ఎంఎల్‌హెచ్‌పిలు ఎస్.లావణ్య, రాజ సులోచన, కనకమ్మ, అశ్విని, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

కేన్సర్ స్క్రీనింగ్ సర్వే పక్కాగా నిర్వహించాలి

రామాపురం :ఈనెల 15 నుంచి నిర్వహించే కేన్సర్ స్క్రీనింగ్ సర్వేను పక్కాగా నిర్వహించాలని ఆరోగ్య సిబ్బంది డిఇఎంఒ దేవ శిరోమణి, మండల వైద్యాధికారి వినోద్‌కుమార్ పేర్కొన్నారు. స్థానిక మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆశా కార్యకర్తలసమావేశానికి ఆమె హాజరై మాట్లాడుతూ గత వారం రోజుల నుండి తల్లిపాల వారోత్సవాలు ప్రతి అంగన్వాడీ కేంద్రంలో జరుగుతున్నాయని, ఆరోగ్య కార్యకర్తలు, ఆశా కార్యకర్తలు తల్లిపాల వారోత్సవాల కార్యక్రమా లకు తప్పక హాజరు కావాలన్నారు. 15 నుంచి గ్రామాల్లో కేన్సర్ స్కీనింగ్ సర్వేలో పాల్గొని సర్వే విజయవంతం చేయా లన్నారు. గ్రామాలలో ప్రస్తుత సీజన్‌లో వర్షాలు కురవడం వల్ల గుంతల్లో మురుగునీరు నిల్వ ఉండడంవల్ల దోమలు వృద్ధి చెంది విష జ్వరాలు, అంటువ్యాధులు ప్రబలే అవకాశం ఉంని అన్నారు. ప్రతి శుక్రవారం డ్రైడే పాటించే విధంగా ప్రజల్లో అవగాహన కల్పించాలని తెలిపారు. వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకున్నప్పుడే వ్యాధులు దరి చేరవనే విష యాలను ప్రజలకు వివరించాలని చెప్పారు. మలేరియా, డెంగీ వంటి విష జ్వరాల కలిగే ప్రమాదాలను ప్రజలకు వివరించాలన్నారు. దోమల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్త చర్యల గురించి తెలపాలన్నారు. దోమ తెరలు వాడాలని, వేపాకు పొగ వేసుకోవాలని తెలిపారు. తల్లిపాల వల్ల బిడ్డకు కలిగే ప్రయోజనాల గురించి అవగాహన కల్పించాలన్నారు. అనంతరం స్థానిక పిహెచ్‌సిలో యుఎస్‌జి స్కానింగ్ పరికరాన్ని అమర్చి పరీక్షించారు. కార్యక్రమంలో డాక్టర్ దివ్య సిహెచ్ఒ ఎలియాజర్, పిహెచ్ఎన్ విజయ కుమారి, ఎంహెచ్ఎల్‌పిలు, ఆరోగ్య కార్యకర్తలు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

ఎన్నికలను సజావుగా నిర్వహించాలి : ఎంఇఒ

ప్రజాశక్తి-పుల్లంపేట

సమావేశంలో మాట్లాడుతున్న ఎంఇఒ చక్రధర్‌రాజు

మండల కేంద్రంలోని ఎస్ఎస్ బివిడి సభ పాఠశాలలో మంగళవారం డిఇఒ శివ ప్రకాష్ రెడ్డి, కమ్యూనిటీ మొబలైజింగ్ అధికారి కరుణాకర్ ఆదేశాల మేరకు ఎంఇఒ చక్రధర్ రాజు ఆధ్వర్యంలో మండల పరిధిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ప్రాథమిక, ప్రాథమికోన్నత పాంశాల ఉపాధ్యాయులతో స్కూల్ కమిటీ ఎన్నికలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఇఒ మాట్లాడుతూ గురువారం నిర్వహించే స్కూల్ మేనేజ్మెంట్ కమిటీ ఎన్నికలను సజావుగా సక్రమంగా ప్రభుత్వ నిబంధనలకు లోబడి రిజర్వేషన్లను అనుసరిస్తూ ఛైర్మన్, వైస్ ఛైర్మన్ ఎన్నికలను నిర్వహించాలని తెలిపారు. డిఇఒ సూచనలు పాటిస్తూ మండలంలోని ఏదైనా పాఠశాలలో ఎటువంటి సమస్య తలెత్తిన ఎంఇఒలకు తెలియజేయాలని పేర్కొన్నారు. స్కూల్ మేనేజ్మెంట్ కమిటీ ఛైర్మన్ ఎన్నికల్లో ఏవైనా సమస్యలు తలెత్తితే వెంటనే ఎస్ఐ, తహశీల్దార్, సచివాలయ సిబ్బంది దృష్టికి తీసుకెళ్లి తగిన సహాయక చర్యలు తీసుకోవాల్సిందిగా పేర్కొన్నారు. ఎన్నికలు ఎటువంటి అవకతవకలు లేకుండా సజావుగా నిర్వహించేందుకు స్థానిక ప్రజలు కూడా సహకరించాలని కోరారు. కార్యక్రమంలో మండల పరిధిలోని అన్ని పాఠశాలల ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలి : ఎస్ఐ

సమావేశంలో మాట్లాడుతున్న ఎస్ఐ హుస్సేన్

ప్రజాశక్తి-సుండుపల్లి

మండల కేంద్రంలోని మిన్నంరెడ్డి కృష్ణారెడ్డి జూనియర్ కళాశాల విద్యార్థులకు ఎస్ఐ ఎస్‌కెఎం హుస్సేన్ గంజాయి మాదక ద్రవ్యలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎస్‌పి విద్యాసాగర్‌నాయుడు ఆదేశాల మేరకు విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా గంజాయి, మాదకద్రవ్యాలను సేవించి యువత పాడవుతోందని అన్నారు. మాదక ద్రవ్యాలను విని యోగించ వల్ల కుటుంబంతో జీవితాలు నాశనమ వుతాయని అన్నారు. గంజాయికి యువత దూరంగా ఉండాలని అలాంటి కార్యకలాపాలకు పాల్పడితే కఠిన శిక్ష తప్పదని హెచ్చరించారు. 1985 నుంచి ఎన్‌డిపిఎస్ చట్టం అమ లులో ఉందని ఈ చట్టం ప్రకారం గంజాయి అమ్మిన కొన్న సేవించిన పది నుంచి 20 సంవత్సరాలు జైలు శిక్ష తప్ప దని అన్నారు. అన్ని దేశాల కంటే మన దేశంలో యువత అధికంగా ఉందని అన్నారు. యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉన్నతంగా చదువుకు భవిష్యత్తుకు బంగారు బాటలు వేసుకోవాలని సూచించారు. లైసెన్స్ లేకుండా డ్రైవింగ్ చేయరాదని, అతి వేగం ప్రమాదకరమని అన్నారు. రోడ్డు భద్రతా నియమాలు పాటించి ప్రమాదాల బారిన పడకుండా చూసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న శ్రీనివాసులు

రుణాలు సక్రమంగా చెల్లించాలి

ప్రజాశక్తి-వీరబల్లి

డ్వాక్రా మహిళలు తీసుకున్న రుణాలు సక్రమంగా చెల్లించాలని ఏరియా కో-ఆర్డినేటర్ కొండా శ్రీనివాసులురెడ్డి పేర్కొన్నారు. మంగళవారం వెలుగు కార్యాలయంలో జరిగిన విఒఎల సమీక్షా సమావేశంలో మాట్లాడుతూ డ్వాక్రా సంఘాలకు అందిస్తున్న రుణాలతో మంచి జీవనోపాదుల ఏర్పాటుకు కృషి చేయాలని సిబ్బందికి ఆదేశించారు. జిల్లా ఎన్‌టిఆర్ భరోసా పెన్షన్ల కో-ఆర్డినేటర్ ధర్మరాజు మాట్లాడుతూ అభయహస్తం పింఛన్ వస్తూ ఆగిపోయిన పెన్షనర్లకు మళ్ళీ పింఛన్ వచ్చేలా రోల్ బ్యాక్ చేస్తామన్నారు. జిల్లా జీవనోపాదుల కో-ఆర్డినేటర్ గంగార్జున మాట్లాడుతూ కేంద్ర పథకమైన లఖ్‌పతీ దీదీ సర్వే పూర్తిచేయాలని కోరారు. లీగల్ కో-ఆర్డినేటర్ ఆనంద్‌బాబు మాట్లాడుతూ మండలంలో సంఘాలన్నీ ఎ గ్రేడ్ లోకి తీసుకొని రావాలన్నారు. కార్యక్రమంలో స్థానిక ఎపియం ఖాదర్‌వలి, సిసిలు కృష్ణయ్య, నాగేంద్ర, కులయప్ప, శుభద్రమ్మ, వెంకటలక్ష్మి, అకౌంటెంట్లు రాజు, మరియమ్మ, విఒఎలు పాల్గొన్నారు.

జనసేన కార్యకర్తకు పరామర్శ

ప్రజాశక్తి-సుండుపల్లి

రాఘువేంద్రను పరామర్శిస్తున్న రామశ్రీనివాస్

టి.సుండుపల్లి మండలం ఏటిగడ్డ రాచపల్లెకు చెందిన నాగశేఖర్ కుమారుడు రాఘువేంద్ర ద్విచక్ర వాహనంపై వెళుతుండగా అదుపు తప్పి బోల్తా పడిన రాఘు వేంద్రకు తీవ్ర గాయాలు అయ్యాయి. కాలు, చేతులకు గాయాలు కావడంతో మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. విషయం తెలుసుకున్న జనసేనపార్టీ నాయ కులు రామ శ్రీనివాస్ ఆస్పత్రికి వెళ్లి రాఘు వేంద్రను పరామర్శించారు. ప్రమాదం జరిగిన సంఘటన వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం రాయచోటి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కార్యక్రమంలో నాగార్జున, పురుషోత్తం, నాగేష్, లక్ష్మయ్య,నాగశేషు పాల్గొన్నారు.

జిల్లెల్లమందలో న్యాయ అవగాహన సదస్సు

ప్రజాశక్తి కంభంవారిపల్లి

బడుగు, బలహీన వర్గాలు, ట్రైబల్ నివాసిత ప్రాంతాలలో న్యాయం, సామజిక ఆరోగ్య అంశాలపై మేలైన అవగాహన ఎంతైనా అవసరమని పిహెచ్‌సి వైద్యాధికారి డాక్టర్ సాయి శిరీష, పారా లీగల్ వాలంటీర్ గట్టప్ప పేర్కొన్నారు. హైకోర్టు ఆదేశాలు మేరకు జిల్లెలమంద పెద్దతాండలో పీలేరు న్యాయసేవధికారిక సంస్థ ఆధ్వర్యంలో న్యాయసలహాలు, పిహెచ్‌సి వైద్యాధికారి ఆధ్వర్యంలో ఉచిత వైద్యసేవలు నిర్వహించారు. ఈ సందర్భంగా సమాజంలో బడుగు బలహీన వర్గాలు, ఆదివాసులు, మహిళలు, పిల్లలు ప్రస్తుత ప్రభుత్వం అందిస్తున్న మెరుగైన న్యాయ, ఆర్థిక, ఆరోగ్యసేవలను, పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఎవరు ఆర్థికంగా చితికిపోకుండా ఉన్న సదుపాయాలు ఉపయోగించుకోవాలని, అందుకు అవగాహన ఎంతో అవసరని తెలిపారు. గ్రామీణ బడుగు బలహీన వర్గాలు అవసరం ఐతే పీలేరు న్యాయవిజ్ఞాన సేవలు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. వ్యాధుల నిర్మూలన కొరకుఆశ కార్యకర్తలు, ఎఎన్ఎంలు గ్రామీణ ప్రాంతాల్లో సందర్శించి వ్యాధి నివారణ చర్యలు చేపట్టేందుకు అవగాహన కల్పించారు. ఉచిత వైద్యశిబిరంలో 42 మందికి చికిత్సలు చేసి మందులు పంపిణీ చేసినట్లు తెలిపారు. కార్యక్రమం పిహెచ్ఎన్, ఎఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

మానసిక ఆరోగ్యంపై శ్రద్ధ చూపాలి

ప్రజాశక్తి - చాపాడు

ప్రపంచ మానసిక ఆరోగ్య అవగాహన దినోత్సవం సందర్భంగా వైద్యులు శ్రీవాణి, కావ్య మాధురి, ఓబులేసు ఆధ్వర్యంలో మానసిక ఆరోగ్య అవగాహన దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ప్రోగ్రాం అధికారులు డాక్టర్ కవితా ప్రసన్న, జిల్లా ఎన్‌సిడిసిడి, ఆర్‌బిఎస్‌కె ప్రోగ్రాం అధికారి డాక్టర రమేష్ మాట్లాడుతూ మానసికంగా ఇబ్బంది పడేవారిని గుర్తించి ఎప్పటికప్పుడు వారి ఆరోగ్య పరిస్థితులు గమనిస్తూ వారిని మానసిక వైద్యుల పర్యవేక్షణలో చికిత్స చేసేలా చూడాలన్నారు. మొబైల్ చూడటం వలన పిల్లల్లో వచ్చే శారీరక, మానసిక, రుగ్మతల గురించి వివరించారు. చాపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు ప్రపంచ మానసిక ఆరోగ్యం గూర్చి డాక్టర్ కవితా ప్రసన్న వివరించారు. ప్రొద్దుటూరు ప్రభుత్వ వైద్య శాలలో ఇపి నెంబర్ 06లో మానసిక వైద్య సేవలకు కౌన్సెలింగ్ చేస్తారని తెలిపారు. కార్యక్రమంలో మండల ఆరోగ్య విస్తరణ అధికారి ఎం.రాఘవయ్య, ఆశా నోడల్ పర్సన్ సుకన్య, సూపర్‌వైజర్స్ బాబూరెడ్డి, సరస్వతి, జడ్పీ హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు గౌస్ మొద్దీన్, పాఠశాల ఉపాధ్యాయులు, ఆర్‌బిఎస్‌కె మేనేజర్ నవీన్, సైక్రియాలజిస్ట్ శిల్పా, రాధిక, సోషల్ వర్కర్ భాస్కర్, సుమన్ బాబు, కేస్ వర్కర్ పవన్‌కుమార్, ఎంఎల్ హెచ్‌పిలు, ఎఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యుత్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలి

ప్రజాశక్తి - మైదుకూరు : విద్యుత్ కార్మికుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని మైదుకూరు డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ భరణికి యునైటెడ్ ఎలక్ట్రిసిటీ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ నాయకులు వినతి పత్రం సమర్పించారు. స్థానిక ఇఇ కార్యాలయంలో మంగళవారం యూనియన్ నాయకులు ఆయనను సన్మా నించారు. ఈ సందర్భంగా తమ డిమాండ్లను తీర్చాలని వినతిపత్రంలో కోరారు. విద్యుత్ సంస్థలో పనిచేస్తున్న ప్రతి కార్మికుడ్ని రెగ్యులర్ చేయాలన్నారు. 2022 పిఆర్‌సి ప్రకారం వేతనం అరియర్స్ వెంటనే ఇవ్వాలని డిమాండ్ చేశారు. విద్యుత్ సంస్థలో పనిచేస్తూ మృతి చెందిన కుటుంబాల్లో ఒకరికి ఉద్యోగం కల్పించి వారిని ఆదుకోవాలని కోరారు. కార్మికుల ఎదుర్కొంటున్న పలు సమ స్యలను ఇఇ దృష్టికి తెచ్చారు. కార్యక్రమంలో డివిజన్ ప్రెసిడెంట్ సుజన్, డివి జన్ సెక్రెటరీ కొండయ్య పాల్గొన్నారు.

క్రైం కార్నర్

కర్ణాటక మద్యం తరలిస్తున్న వ్యక్తి అరెస్టు

ప్రజాశక్తి-ములకలచెరువు

కర్ణాటక మద్యం అక్రమంగా తరలిస్తున్న వ్యక్తిని అరెస్టు చేసినట్లు ములకలచెరువు ఎస్ఇబి సిఐ రామ్మోహన్ తెలిపారు. మండలంలోని దేవలచెరువు పంచాయతీ, చిటికివారిపల్లికి చెందిన వడ్డీ రామచంద్ర కుమారుడు రమణప్ప మంగళవారం కర్ణాటక నుంచి టెట్రా ప్యాకెట్లు 40 బ్యాగులో తీసుకవస్తున్నట్లు సమాచారం అందిందని చెప్పారు వెంటనే సిబ్బందితో వెళ్లి పెద్దపాల్యం, వేపూరుకోటకు వెళ్లే మార్గంలోని బత్తలాపురం క్రాస్ వద్ద రమణప్పను అరెస్టు మద్యం ప్యాకెట్లు సీజ్ చేసినట్లు తెలిపారు. నిందితుడిపై కేసు నమోదు చేసి కోర్టుకు పరుస్తున్నట్లు తెలిపారు.

తుపాకీతో కాల్చుకుని వ్యక్తి ఆత్మహత్య

ప్రజాశక్తి-చిన్నమండెం

మండలం బోనమల గ్రామం కనకంటి వాండ్లపల్లెకు చెందిన ముత్యాలు కుమారుడు రాజగోపాల్ ముదినేనివాండ్లపల్లె వద్ద నాటు తుపాకీతో కాల్చుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. ఇటుకల వ్యాపారం చేసుకుంటూ జీవిస్తున్న రాజగోపాల్ నాటు తుఫాకితో కాల్చుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు తెలిపారు. మృతి అప్పుల బాధే కారణమా లేక మరేమైనా కారణాలు ఉన్నాయో విచారణ తెలియాల్సి ఉందని అన్నారు. రాజగోపాల్ ఆత్మహత్య లేక హత్య అన్న కోణంలో కూడా దార్యప్తు వేగవంతం చేస్తామని తెలిపారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి నాటు తుపాకిని స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు.